తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

## భక్తుల సేవకు పూర్వజన్మసుకృతం

### -టిటిడి జెఈఓ గోపీనాథ్



తిరుమల, ఆగస్టు 10(ప్రభాతవార్తప్రతినిధి:

దేవుని చెంత సేవకుడిగా భక్తులకు సేవచేసే భాగ్యం కలగడం తన పూర్వజన్మ సుకృతమని టిటిడి జేఈఓ ప్రభల గోపీనాథ్ అన్నారు. టిటిడి జెఈఓగా నియమితులైన ఆయన సోమవారం సాయంత్రం తిరుమల ఆలయంలో సాంప్రదాయంగా బాధ్యతలు చేపట్టారు. టిటిడి విద్యవైద్యం జెఈఓగా ఆయన నియమితులయ్యారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈఓలోకనాథం, బోర్డు సెల్ డిప్యూటీ ఈఓ ప్రశాంతి, ఆలయ పేష్కార్ రామకృష్ణఇతర అధికారులు పాల్గొన్నారు.



ప్రధాని మోడీ పిలుపు మేరకు "హర్ తిరంగా" చారిత్రాత్మక చంద్రగిరి రాయలవారి కోట త్రివర్ణ పతాక వెలుగులతో మిరుమిట్లు గొల్పుతున్న రాయలవారి కోట రాజసం అద్భుత దృశ్యం.

ప్రభాతవార్త.. చంద్రగిరి

## కుప్పంలో కూటమి శ్రేణుల భారీ ర్యాలీ



కుప్పం, ఆగస్టు 10 ప్రభాతవార్త

నియోజకవర్గ కేంద్రమైన కుప్పం పట్టణంలో తెదేపా, జనసేన, భాజపా నేతలు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా ఈ విజయోత్సవ ర్యాలీని స్థానిక పాతపేట చెరువు కట్ట వద్దనుంచి బస్టాండ్ వరకు నిర్వహించారు. పార్టీ శ్రేణులు ఆయా పార్టీల జెండాలతో ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## వైకాపా నిరసన ర్యాలీలో ఉద్రిక్తత

**- ర్యాలీ నిర్వహించకుండా మోకాలడ్డిన పోలీసులు**

**- ఎంపి విజయానందరెడ్డితో పాటు పలువురు వైకాపా నాయకులు, కార్యకర్తలు అరెస్టు**

చిత్తూరు, ఆగస్టు 10 ప్రభాతవార్త:

డిఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలకు బాధ్యత వహించి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో చిత్తూరులో సోమవారం వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎంపి విజయానందరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ర్యాలీలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ర్యాలీ నిర్వహించడానికి అనుమతి లేదని పోలీసులు వైకాపా నాయకులు, కార్యకర్తలను అడ్డుకుంటే మరోవైపు ఆరు నూరైనా ర్యాలీ నిర్వహిస్తామని వైకాపా నాయకులు, కార్యకర్తలు పంతంకు వెళ్ళడంతో ఎంపి విజయానందరెడ్డికి పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. వైకాపా నాయకులు, కార్యకర్తలు నిరసన ర్యాలీని నిర్వహించి తీరుతామని పట్టుబడ్డి ముందడుగు వేయడంతో పోలీసులు వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎంపి విజయానందరెడ్డితో పాటు వైకాపా నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి టుటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డిఎస్సీలో జరిగిన అక్రమాలకు బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సత్వరం రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గత నాలుగు రోజులుగా వైకాపా ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా రిలే నిరాహారదీక్షలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం నియోజకవర్గ కేంద్రాల్లో వైకాపా నిరసన ర్యాలీలు నిర్వహించాల్సి వుండటంతో వైకాపా నాయకులు, కార్యకర్తలు నిరసన ర్యాలీలు నిర్వహించడానికి సిద్ధమయ్యారు. చిత్తూరు వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జి ఎంపి విజయానందరెడ్డి ఆధ్వర్యంలో చిత్తూరు గంగినేని చెరువు వద్ద నుండి దర్గా సర్కిల్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించి అనంతరం అర్డీఓకు వినతిపత్రం ఇవ్వడానికి వైకాపా నాయకులు, కార్యకర్తలు సిద్ధమయ్యారు. అయితే నిరసన ర్యాలీ ప్రారంభానికి ముందే భారీగా గంగినేని చెరువు పరిసరాల్లోకి పోలీసులు చేరుకుని ర్యాలీ జరగకుండా అడ్డుకున్నారు. నిరసన ర్యాలీ ప్రారంభ ప్రదేశమైన గంగినేని చెరువు ఆవరణకు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి ఎంపి విజయానందరెడ్డి వచ్చిన వెంటనే పోలీసులు ఆయనతో పాటు వైకాపా నాయకులు, కార్యకర్తలను అడ్డుకుని నిరసన ర్యాలీ నిర్వహణకు పోలీసుల అనుమతి లేదని, ర్యాలీ నిర్వహించకుండా విరమించుకోవాలని స్పష్టం చేశారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం వైకాపా ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలు జరుగుతున్నాయని, ఈ క్రమంలో తాము సైతం శాంతియుతంగా నిరసన ర్యాలీ నిర్వహించి అధికారులకు వినపత్రం ఇస్తామని ఎంపి విజయానందరెడ్డి పోలీసులకు స్పష్టం చేశారు. అయితే పోలీసులు ఎంపి విజయానందరెడ్డి ఆధ్వర్యంలో జరుగడానికి సద్ధమైన ర్యాలీని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఎంపి విజయానందరెడ్డి, వైకాపా నాయకులు, కార్యకర్తలు పోలీసులతో తీవ్ర వాగ్వివాదంకు దిగారు. అయితే పోలీసులు ఎంపి విజయానందరెడ్డితో పాటు ఇతర వైకాపా నాయకులు, కార్యకర్తలు గంగినేని చెరువు పరిసరాల నుండి ముందుకు వెళ్ళకుండా కట్టడి చేశారు. పోలీసులు అడ్డుకుంటున్నప్పటికీ వైకాపా నాయకులు ర్యాలీకి సిద్ధం కావడంతో పోలీసులు ఎంపి విజయానందరెడ్డితో పాటు డిప్యుటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్, రాష్ట్ర మొదలియార్ సంఘ నాయకులు జ్ఞాన జగదీష్, మహిళా వైకాపా నాయకురాలు గాయత్రిదేవి, ఇతర వైకాపా నాయకులు, కార్యకర్తలను పోలీసులు బలవంతంగా తమ వాహనంలోకి ఎక్కించుకుని టుటౌన్ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్ళి కేసు నమోదు చేశారు. ఎంపి విజయానందరెడ్డితో పాటు ఇతర వైకాపా నాయకులను పోలీసులు అరెస్టు చేసి టుటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో అక్కడికి పెద్ద ఎత్తున వైకాపా నాయకులు, కార్యకర్తలు చేరుకుని పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనలో వైకాపా నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా, జై జగన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు, వైకాపా నాయకుల మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. ఈ సందర్భంగా ఎంపి విజయానందరెడ్డి మాట్లాడుతూ డిఎస్సీ అక్రమాలపై సిబిఐతో సమగ్ర విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. చిత్తూరులో జరిగిన వైకాపా నిరసన ర్యాలీని డిఎస్పీ వెంకట నారాయణ ఆధ్వర్యంలో చిత్తూరు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ చిన్నపెద్దయ్య, చిత్తూరు వెస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీధర్‌నాయుడులు ఎంపి విజయానందరెడ్డి, ఇతర వైకాపా నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



కలశోద్వాసన

## ధ్వజావరోహణం



శ్రీకాళహస్తి, ఆగస్టు 10 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలోని చెంగల్వరాయస్వామి ఆలయం వద్ద అనుబంధ ఆలయం అయిన కుమారస్వామి కొండపై వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయంలో జరిగిన ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా సోమవారం రాత్రి విశేష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా యాగశాలలో ప్రతిష్ఠించిన కలశాలను ఉద్వాసన జరిపారు. యాగశాలలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కాగా యాగశాలలో ప్రతిష్టించిన కలశాలను ఉద్వాసన జరిపారు. ఈ కలశాలను అర్చకులు ఆలయంలో ఊరేగింపు జరిపి ఆ నీటితో ఉత్సవర్లకు అభిషేకం జరిపారు. వేద మంత్రోచ్చారణతో ఆలయ ప్రాకారం దద్దరిల్లింది. ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ ఇఓ బికె వెంకటేశులు ధర్మకర్తల మండలి సభ్యులు వాకచర్ల గురప్పశెట్టి, పగడాల మురళి, అర్చకులు ఎస్ఎంకె పరశురామ్‌గురుకుల్ (అచ్చితా స్వామి), డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి స్థానికులు గాజుల సత్యనారాయణ, రవీంద్రబాబు, టెంపుల్‌ఇన్స్‌పెక్టర్ హరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**ధ్వజావరోహణం:**

ఆడికృత్తిక మహోత్సవాలు ముగింపు సందర్భంగా ఆలయంలో సోమవారం రాత్రి ద్వజావరోహణ కార్యక్రమాల్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన కలశాల్ని ఉద్వాసన గావించారు. అర్చకులు, రుత్వికులు కలశాల్ని వేదమంత్రాలను వేదపండితులు పఠిస్తుండగా మేళ తాళాలు మంగళవాయిద్యాలతో చేర్చారు. అక్కడ ధ్వజావరోహణ కార్యక్రమాల్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్, సభ్యుడు వాకచర్ల గురప్పశెట్టి, ఇఓ బికె వెంకటేశులు, ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి టెంపుల్ ఇన్స్‌పెక్టర్ హరియాదవ్, నాగభూషణం యాదవ్‌తదితరులు పాల్గొన్నారు.

## కారు, బైకు ఢీ

### ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి తీవ్ర గాయాలు

రేణిగుంట, ఆగస్టు 10 ప్రభాతవార్త



రేణిగుంట పట్టణ ముఖద్వారం రమణ విలాస్ సర్కిల్ వద్ద ఆదివారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. రేణిగుంట పట్టణం మధురానగర్ సంత గేటు దగ్గర ఉన్న మనోహర్ (50) అతని భార్య వాణి(48) మనుమరాలు సహస్ర (6), మనుమడు మన్విత్ (5) లతో ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తి వైపు వెళుతున్నారు. శ్రీకాళహస్తి వైపు నుండి కోడూరు వైపు వెళ్తున్న కారు మోటార్ సైకిల్ ను అతివేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం దగ్గర్లో ఉన్న అమర ఆసుపత్రికి తరలించారు. రేణిగుంట అర్బన్ పోలీసులు కారు డ్రైవర్ అక్షయ్ కుమార్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాణిపాకంలో

## ఘనంగా సహస్ర ఘటాభిషేకం



కాణిపాకం, ఆగస్టు 10 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ ధర్మాదాయశాఖల ఆదేశాల మేరకు దేశంలో, రాష్ట్రంలో సుభిక్షంగా వర్షాలు కురవాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో వుండాలని ఆకాంక్షిస్తూ కాణిపాకం దేవస్థానంలో సోమవారం సమస్ర ఘటాభిషేకంను సోమవారం ఘనంగా నిర్వహించారు. కాణిపాకం దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంభిగా సమేత మణికంతేశ్వరాలయంలో దేవస్థానం ఛైర్మన్ మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్‌ల ఆధ్వర్యంలో సహస్ర ఘటాభిషేకంను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో అర్చకులు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహావాచనం, కలశస్థాపన, వరుణ గాయత్రి జపం, వరుణ గాయత్రి హవనం, మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, సహస్ర ఘటాభిషేకంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈమేరకు 1008 బిందెల పవిత్ర జలంతో స్వామివారి మూల విరాట్ మునిగేంత వరకు అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించి దూప దీప నైవేద్యాలను సమర్పించి విశస్త్ర సమర్పణ గావించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, స్థానాచార్యులు పణిస్వామి, పాలకమండలి సభ్యులు అనసూయ, కృష్ణవేణి, సూపరెండెంట్‌లు వాసు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవి, అర్చకులు, వేదపండితులు, ఆలయ ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

## విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలంటూ వైసిపి భారీ ర్యాలీ



చంద్రగిరి, ఆగస్టు 10 ప్రభాతవార్త:

మెగా డిఎస్సీ నియామకాలలో చోటుచేసుకున్న అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చెయ్యాలంటూ వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి డిమాండ్ చేశారు. వైసిపి రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు .. డిఎస్సీ నియామకాలలో అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపిస్తూ సోమవారం చంద్రగిరిలో నియోజకవర్గ స్థాయి వైసిపి నాయకులు, కార్యకర్తలు నాగాలమ్మ మలుపు నుండి టవర్ క్లాక్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16 వేల మంది డిఎస్సీ నియామక ప్రక్రియలో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాలతో అర్హులైన అభ్యర్థులకు తీరని అన్యాయం జరిగిందని ఆరోపించారు. 5 ఏళ్ళ వైసిపి పాలనలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన సచివాలయ నియామకాలలో చిన్న అవినీతికి అవకాశం లేకుండా పారదర్శకంగా లక్ష మందికి పైగా నియమించినట్లు తెలిపారు. డిఎస్సీ నియామకాలపై సిబిఐ విచారణకు సహకరించి కూటమి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. దాదాపు మూడేళ్ళు గడిచిపోతున్నా నిరుద్యోగ భృతి కల్పించడంలో మీనమేషాలు లెక్కబెడుతూ యువతను మోసం చేస్తున్నట్లు దుయ్యబట్టారు. 20 లక్షల ఉద్యోలిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉద్యోగాలు ఊసే ఎత్తడం లేదంటూ ఎద్దేవా చేశారు.

**-పోటెత్తిన జనసందోహం ..**

చంద్రగిరి నడిబొడ్డున వైసిపి చేపట్టిన భారీ ర్యాలీ "నిరసన సెగ" విజయవంతం కావడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. నియోజకవర్గ వ్యాప్తంగా గల వైసిపి శ్రేణులు వేలాదిగా చంద్రగిరి తరలి రావడంతో నేల ఈనిందా అన్న చందంగా బారులుతీరిన ర్యాలీ నిరసన సెగ ఆద్యంతం ఆకట్టుకున్నది. గత రెండేళ్ళ కాలంలో ఎన్నడూ లేని రీతిన వైసిపి చేపట్టిన నిరసన కార్యక్రమం ముఖ్యమంత్రి సొంత ఇలాఖాలో విజయవంతం కావడంతో ప్రజల్లో ప్రభుత్వంపై ఇంతటి వ్యతిరేకత వుందా అనే చర్చ మొదలయ్యింది.

## సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలి



శ్రీరంగరాజపురం, ఆగస్టు 10 ప్రభాతవార్త:

క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలు పరిష్కారానికి అవకాశం వున్నప్పటికీ అత్యధికులు మండల స్థాయి అధికారుల వద్ద సమస్యలను ప్రస్తావించకుండా నేరుగా జిల్లా స్థాయి అధికారుల వద్దకు వచ్చి సమస్యలు ప్రస్తావిస్తుండటంతో అత్యధిక సమస్యలకు పరిష్కారం కన్పించడం లేదని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలను పరిష్కరించడానికి జిల్లా అధికార యంత్రాంగం మొత్తం విచ్చేసిందని, ప్రజలు తమ సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. ఎస్ఆర్ పురం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్, జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుండి మొత్తం 217 ఫిర్యాదులు అందాయి. మండల స్థాయిలో ప్రజా సమస్యలను తగ్గించడానికి జిల్లా అధికారులు శ్రీరంగరాజపురంలో జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఏర్పాటు చేశారని, దీని ద్వారా ప్రజలకు అందుబాటులో పరిష్కరించడానికి వీలైన సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాజేంద్రన్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకటేష్, డిఆర్ఓ మోహన్‌కుమార్, చిత్తూరు అర్డీఓ శ్రీనివాసులు, తహసిల్దారు లోకనాధపిళ్ళై, ఎంపిడిఓ వనజ, నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల తహసిల్దార్లు, జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు, తెలుగుదేశం నాయకులు జయశంకర్‌నాయుడు, రాజశేఖర్‌నాయుడు, చిట్టిబాబునాయుడు, కెఎం రవి, శేఖర్, చొక్కమడుగు కుమార్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 333 అర్జీలు..

### జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవింద రావు

తిరుపతి కలెక్టరేట్, ఆగష్టు 10 ప్రభాతవార్త:



ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవింద రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కు వచ్చిన అర్జీదారులకు గౌరవ ప్రదంగా కుర్చీల ఏర్పాటుతో, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు త్రాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్, గ్రామాల నుండి వచ్చు అర్జీదారులకు టి సరఫరా తదితర సౌకర్యాలను కల్పించి వారి సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పీ జి ఆర్ ఎస్ లో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని అర్జీదారుల సమస్యలపై నిరక్ష్యం వహిం చరాదని తెలిపారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఎ ఓపెనింగ్ లేకుండా అర్జిదారుడు సంతృప్తి చెందేలా అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. పీ జి ఆర్ ఎస్ లో వచ్చు అర్జీలపై నిరక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుం టామని తెలిపారు. జిల్లా రెవిన్యూ అధికారి నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శివశంకర్ నాయక్, భరత్ నాయక్, నాగార్జున, రామాం జనమ్మ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ గీతాంజలి లతో కలసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి, ఆన్లైన్ నమోదుతో సిబ్బంది రసీదులు అం దించారు. అధికారులు అందరు సదరు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పరిష్కరించాలని స్పందనకు హాజరయిన వివిధ శాఖలకు సంబందించిన జిల్లా అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్

ప్రశాంతంగా ఏపీ టెట్-2026 పరీక్షలు

న్యాయపరమైన అంశాలపై సలహాలకు న్యాయసహాయ కేంద్రం

వైసీపీ ఎమ్మెల్సీపై జనసేన నేతల ఫిర్యాదు

4లో



# డైపర్లు వాడుతున్నారా?

**పసి పిల్లలకు డైపర్లు వేయడం ఇప్పుడు అలవాటుగా** మారింది కానీ, ఈ పని దీర్ఘకాలంలో అనేక అనారోగ్యాలకు దారి తీస్తుందంటున్నారు నిపుణులు. పనిఒత్తిడి, అసౌకర్యం తగ్గించుకోవడానికి ఏర్పాటు చేసుకున్న ఈ వెసులుబాటు కాస్తా ఇప్పుడు తప్పనిసరి అలవాటుగా మార్చేశారనీ చెబుతున్నారు. పిల్లలకు నడకవచ్చిన నాటి నుంచే తమంతట తాముగా కాలకృత్యాలు తీర్చుకోవడం క్రమంగా నేర్పాలట. లేదంటే వారికి టాయిలెట్ ట్రెయినింగ్ ఇవ్వడం కష్టమవుతుంది. అలాకాకుండా తాత్కాలికంగా మీ సౌకర్యం కోసం గంటల తరబడి డైపర్లను వేసి ఉంచడం వల్ల చెమట, తడి.. వంటివి చేరి బ్యాక్టీ రియా రెట్టింపు అవుతుంది. ఆ తరువాత వాటిని ఎక్కువసేపు తీయకుండా ఉంచేయడం వల్ల యూరినరీ ట్రాక్ ఇన్ఫెక్షన్ల బారిన పడే అవకాశమూ ఉంది. అందుకే, గంటా రెండు గంటలు మినహా వాటిని వేయకపోవడమే మేలని సూచిస్తున్నారు. □

# పండ్ల పక్వానికి పేపర్ బ్యాగ్



ఒకప్పుడు ఆన్‌లైన్‌లో బట్టలు మాత్రమే ఆర్డర్ చేసేవాళ్లం. మరిప్పుడో కూరగాయల దగ్గర నుంచి పప్పుఉప్పుల వరకూ అన్నీ ఆన్‌లైన్‌లోనే దొరికేస్తున్నాయి. మార్కెట్‌కు వెళ్లకుండానే క్షణాల్లో మన ఇంటికి వచ్చేస్తున్నాయి. మరి వాటి ప్యాకింగ్‌లో వచ్చే బ్రౌన్ పేపర్ బ్యాగ్ ఏం చేస్తున్నారు? ఇంకేం చేస్తాం చెత్తలో పడేస్తాం అంటారా! కాస్త తెలివిగా ఆలోచిస్తే వాటిని తిరిగి వాడుకో వచ్చు తెలుసా? మామిడి, అరటి, బొప్పాయి, అవకాడో వంటి పండ్లు సహజంగా పక్వానికి రావడానికి ఇవి ఉపయోగపడ తాయి. వాటిని ఈ పేపర్ బ్యాగ్లో పెడితే సరి. పక్వానికి వచ్చే పండ్లు ఇథిలీన్ అనే సహజ వాయువుని విడుదల చేస్తుంది. ఈ కాగితపు సంచులు ఆ గాలిని బయటకు పోనివ్వకుండా ఆపి, పండ్లు సహజంగా పండేలా చేస్తాయి. ఫ్రిజ్లో కూరగాయల ట్రే కింద దీన్ని వేసి చూడండి తేమను ఇట్టే పీల్చేస్తుంది. అంతేకాదు, ఉల్లి, బంగాళ దుంపలు ఇందులో ఉంచితే త్వరగా మొలకలు రావు. అంతేనా గిఫ్ట్ ప్యాక్ చేయడానికి వాడుకోవచ్చు. వింటేజ్ లుక్ భలే అందంగా కనిపిస్తుంది. పైగా

# మష్రూమ్‌తో మాయా లోకానికి!



మీకు పుట్టగొడుగులంటే ఇష్టమేనా? అవెక్కడైనా కనిపిస్తే తినేయాలని నోరూరుతుందా? అయితే తస్మాత్ జాగ్రత్తగానే ఉండాలి. ఎందుకంటే అన్ని పుట్టగొడుగులూ తినేందుకు పనికిరాదని శాస్త్రజ్ఞులు తేల్చేసారు. ఒకఅరుదైన పుట్ట గొడుగు గురించి మిస్టరీని ఛేదించి అందులో ఏముందో అసలు అదేమిటి? అన్న విషయాన్ని విశ్లేషించి చెబుతున్నారు. 'లాన్మోవా ఆసియాటికా' అనే జాతి పుట్టగొడుగులు తింటే చిత్త భ్రాంతి కలుగుతుందని గుర్తించారు. అదో వింత అనుభూతి అవి తిన్నవారికి 90 శాతం మందికి 3 నుంచి 30 సెంటీమీటర్ల పొడవున్న చిన్న చిన్న మానవ ఆకారాలు కనిపిస్తున్నాయట. ఈ ఆకారాలు యక్షి ణులు, విదూషకులు లేదా అద్భుతమైన దుస్తులు ధరించిన వారిలా ఉంటాయన్న ఆనవాళ్లను బాధితులు వివరించారు. ఈ చిన్న ఆకారాలు సాధారణ భౌతిక నియమాలకు అనుగుణంగా వస్తువుల చుట్టూ నడవడం, అంచుల నుంచి కింద పడటం వంటివి చేస్తుంటాయని వివరించారు. అపుడెపుడో 'భైరవద్వీపం' సినిమాలోలా మరుగుజ్జులు కళ్లముందు కదులుతాయంటే నమ్మండి. యునాన్‌లో ఈ పుట్టగొడుగును ఆహారంగా తింటారు. అయితే, సరిగా ఉడికించకుండా తిన్నప్పుడే ఇది భ్రమలను కలిగిస్తుం డటం విశేషం. ఈ అంతుచిక్కని రసాయనాన్ని వేరుచేయడం ద్వారా మానవ మెదడు, స్పృహ,గ్రహణ శక్తిపై అధ్యయనానికి కొత్త మార్గాలు తెరుచుకుంటాయని శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఈ వింత అనుభవం గురించి తొలిసారిగా 1934లో పాపువా న్యూగినియాలో 'మష్రూమ్ మ్యాడ్‌నెస్' పేరుతో వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత చైనాలోని యునాన్ ప్రాంతంలో 'జియాన్ షౌ క్వింగ్'గా, ఫిలిప్పీన్స్ లో 'సెడెస్‌డెమ్'గా పిలిచే పుట్టగొడుగులు తిన్నవారికి కూడా ఇలాంటి అనుభవాలే ఎదురయ్యాయి. తాజాగా యూటా విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు కోలిన్ డోమ్నార్, బ్రైన్ డెంటింగర్.. చైనా, ఫిలిప్పీన్స్ నుంచి సేకరించిన నమూనాలపై డీఎన్ఏ పరీక్షలు జరిపి, అవన్నీ ఒకే జాతికి చెందిన 'లాన్మోవా ఆసియాటికా' అని తేల్చారు.ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈ పుట్టగొడుగులలో సైలోసైబిన్ వంటి తెలిసిన సైకెడెలిక్ (మత్తును కలిగించే) రసాయనాలు ఏవీ లేవని తేలింది. ఈ పుట్టగొడుగు 'లాన్మోవా ఆసియాటికా' జాతికి చెందిన ఈ పుట్టగొడుగ తాజా డీఎన్ఏ విశ్లేషణలో శాస్త్రవేత్తలు నిర్ధారించారు. చైనా, ఫిలిప్పీన్స్‌లో లభించే నమూనాలు కూడా ఇక జాతివని కనుగొన్నారు. ఈ పరిశోధన వివరాలు 2026లో 'మైకోలాజియా' అనే సైన్స్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

# నిదుర'మత్తు' వీడాలి..



కాఫీ, టీ వంటివి పడుకునే ముందు అస్సలు తాగకూడదు. మధ్యాహ్నం ఎక్కువ సేపు పడుకోవడం వల్ల కూడా రాత్రుళ్ల నిద్ర పట్టదు. తద్వారా గంటల తరబడి నిద్రపోవ డానికి శరీరం అలవాటు పడుతుంది. కాబట్టి పగలు అరగంటకు మించి కునుకు తీయకపోవ డమే మంచిదంటున్నారు

నిద్ర పట్టక కొంతమంది బాధపడితే, మరికొందరు అతి నిద్రతో సతమతమవు తుంటారు. అయితే నిద్ర తక్కువైనా, ఎక్కువైనా ఆరోగ్యానికి మంచిది కాదంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో వయసును బట్టి ఎవరికి ఎన్ని గంటలు నిద్ర అవసరమో, ఒకవేళ అతి నిద్ర సమస్య కూడా మంచిది కాదు. వయసును బట్టి నిద్ర సమయాలు తెలుసుకుంటే అతి నిద్రకు అడ్డుకట్ట వేయచ్చంటున్నారు నిపుణులు. తద్వారా ఎన్నో అనారోగ్యాలకు దూరంగా ఉండచ్చంటున్నారు. కొన్ని పరిశోధనలు ప్రకారం ఎవరికి ఎన్ని గంటలు నిద్ర అవసరమంటే.. 1. అప్పుడే పుట్టిన పిల్లలు: 14-17 గంటలు. ఏడాది లోపు చిన్నారులు : 1215 గంటలు, 1-2 ఏళ్ల వయసున్న వారు : 11-14 గంటలు, 3-5 ఏళ్ల వయసున్న వారు: 10-13 గంటలు. స్కూలు కెళ్లే పిల్లలు (6-12 ఏళ్లు ) 9-11 గంటలు, టీనేజర్లు (13-19 ఏళ్లు) 8-10 గంటలు, పెద్దలు: 7-9 గంటలు. వృద్ధులు : 7-8 గంటలు.

**ఇలా చెక్ పెట్టచ్చు...** ఈ క్రమంలో ఒకవేళ అతి నిద్ర సమస్యతో బాధపడుతున్నట్లయితే రోజువారీ జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవడం అత్యవసరం అంటున్నారు నిపుణులు.

. రోజూ ఒకే తరహా నిద్ర సమయాల్ని పాటించాలి. అంటే. వారాంతాలు సెలవు రోజుల్లో కూడా నిర్ణీత వేళకే నిద్ర లేవాలన్న మాట! కొంతమందికి రాత్రుళ్ల సరిగ్గా నిద్ర పట్టక ఉదయం ఆలస్యంగా లేస్తుంటారు. అలాంటి వాళ్ల నిద్రకు ఉపక్రమించేలా పడకగదిలో ప్రశాంతమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవాలి. అలాగే నిద్రా భంగంచేసే ఎలక్ట్రానిక్ పరికరాలను దూరం పెట్టాలి. . కెఫీన్‌కు నిద్రను భంగం చేసే లక్షణముంది. కాబట్టి

నిపుణులు.వ్యాయా మాల వల్ల ఆరోగ్యమే కాదు. నిద్ర సమయాలు కూడా అదుపు లో ఉంటా యంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో శరీరం అలసిపోయి తద్వారా నిద్రలేమిని కూడా అధిగమించచ్చు. అలాగే ఆహారంలోనూ పలు మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. సుఖ నిద్రను ప్రేరేపించే పాలు, పాల పదార్థాలు, బాదం, కివీ పండ్లు, చామొమైల్ టీ. వంటివి తరచూ తీసుకోవడం మంచిది. వీటితో పాటు మానసిక ఆందోళనలు, ఒత్తిళ్లను దూరం పెట్టడమూ ముఖ్యమే! అయితే ఇన్ని చేసినా అతి నిద్రను దూరం చేసుకోలేక పోయినా,ఇతర అనా రోగ్యాలు వేధిస్తున్నా.. వెంటనే సంబంధిత నిపుణుల్ని సంప్రదిస్తే సమస్య తీవ్రం

# హనుమంతుని నవ అవతారాలు



హనుమంతుడిని స్మరించినంత మాత్రాన్నే బుద్ధి .. బలం .. యశస్సు .. ధైర్యం .. నిర్భయత్వం ఆరోగ్యం .. చైతన్యం వాక్పటిమ కలుతాయని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. అలాంటి హనుమంతుడు రామాలయా లలోను .. ఉపలయాలలోను .. ప్రధాన దైవంగాను పూజాభిషేకాలు అందుకుంటూ ఉంటాడు. భక్తులను అనుగ్రహించడం కోసం ఆయన నవ అవతారాలను ధరించాడు. ప్రసన్నాంజ నేయస్వామిగా .. వీరాంజనేయ స్వామిగా .. వింశతి భుజాంజనేయ స్వామిగా .. పంచము ఖాంజనేయ స్వామిగా .. అష్టాదశ భుజాంజనేయ స్వామిగా .. సువర్చల సహిత ఆంజనేయస్వామిగా .. చతుర్భుజాంజనేయస్వామిగా .. ద్వాత్రిం శద్భుజాంజనేయ స్వామిగా .. వానరాంజనేయస్వామిగా ఆయన ఆయా క్షేత్రాల్లో కొలువై భక్తుల మనోభీష్టాలను నెరవేర్చుతున్నాడు. సకల దేవతల అనుగ్రహం ఆంజనేయస్వామికి ఉండేలా బ్రహ్మదేవుడి వరం వుంది. అందువలన హనుమంతుడిని పూజించడం వలన, సకల దేవతల అనుగ్రహం లభిస్తుందనేది పెద్దల మాట. □

# అవకాడో చట్నీ



**కావలసిన పదా ర్థాలు**

అవకాడోలు: రెండు, పచ్చి మిర్చి: నాలుగు, వెల్లుల్లి రెబ్బలు: నాలుగు, అల్లం: అంగుళం ముక్క, ఎండు మిర్చి: రెండు, ఆ లజీలకర్ర, ఆవాలు, శనగ పప్పు, మినుప పప్పు: అర టీస్పూన్ చొప్పున, పసుపు: చిటికెడు, కరివేపాకు: ఒక రెబ్బ, కొత్తిమీర: కొద్దిగా, నూనె: ఒక టేబుల్ స్పూన్, ఉప్పు: తగినంత.

**తయారీ విధానం:** ముందుగా అవకాడో గుజ్జుతీసి పెట్టుకోవాలి. మిక్సీ గిన్నెలో అవకాడో గుజ్జు, పచ్చిమిర్చి, వెల్లుల్లి, అల్లం, ఉప్పు, కొత్తిమీర వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి నూనె వేడయ్యాక ఆవాలు, జీలకర్ర, ఎండు మిర్చి, కరివేపాకు, మినుప పప్పు, శనగ పప్పు వేసి వేయించి, పైన పసుపు చిలకరించి.. అవకాడో మిశ్రమంలో కలుపుకొంటే అవకాడో చట్నీ రెడీ. అన్నంతోపాటు చపాతీ, ఇడ్లీ వంటి టిఫిన్లకూ ఇది చక్కటి జోడి. □

తెర

# 'గజ' టీజర్ లాంచ్ ఈవెంట్‌లో మంచు మనోజ్



చలమలశెట్టి సునీల్ సమర్పణలో సతీష్ జై ఫిల్మ్స్ బ్యానర్‌పై సతీష్ జై, ఫర్నాజ్ శెట్టి ప్రధాన పాత్రల్లో డా. మైత్రి శరణ్ నిర్మించిన చిత్రం"గజ. పద్మనాభ రెడ్డి, జి.మధుసూదన్, ఎం.నరేంద్ర సహ నిర్మాతలు. ఈ సినిమాకి సతీష్ జై దర్శకత్వం వహించారు. ఈ మూవీకి మెలోడీ బ్రహ్మ మణిశర్మ సంగీతాన్ని అందించారు. ఈ సినిమాని మైత్రి మూవీస్ తెలుగులో రిలీజ్ చేస్తోంది.

ఈ టీజర్ లాంచ్ ఈవెంట్‌కి మంచు మనోజ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో.. ..మంచు మనోజ్ మాట్లా డుతూ.. సతీష్ జై హీరోగా, దర్శకుడిగా, నిర్మాతగా ధైర్యం చేసి అడుగు ముందుకు వేశారు. చాలా మందికి అలాంటి ధైర్యం ఉండదు. ఇంత ధైర్యంగా అడుగు వేస్తున్న సతీష్‌కి మంచి విజయం దక్కాలి. గజ టీజర్ బాగుంది. మణిశర్మ గారు అద్భుతమైన స్కోర్ ఇచ్చారు. ఇండస్ట్రీకి కులం, గోత్రం లేదు. కళామతల్లికి కులం, మతం లేదు. సినిమా వాళ్లకి, ఆడియెన్స్‌కి, మీడియాకి తేడా ఉండదు మనమంతా ప్రేమికులం. హీరో, దర్శకుడు సతీష్ జై మాట్లాడుతూ.. గజ చిత్రానికి గట్స్ కా బాప్ అని ట్యాగ్ లైన్ పెట్టాను. గట్స్ కా బాప్ అంటే మంచు మనోజ్ అన్న. ఆయన ఎంత బిజీగా ఉన్నా నా కోసం వచ్చారు. ఓ ఆడియెన్‌గా ఆలోచించే ఈ కథను రాసుకున్నాను. ఈ మూవీ కోసం అందరం కష్టపడ్డాం. గజ టీజర్ అందరికీ నచ్చే ఉంటుందని భావిస్తు న్నాను.ఫెర్నాజ్ మాట్లాడుతూ.. గజ చిత్రంలో అవకాశం ఇచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. ఈ సినిమా అద్భుతంగా ఉండబో తోంది. నిర్మాత మైత్రి శరణ్ మాట్లాడుతూ.. .."మా కోసం వచ్చిన మనోజ్ సార్‌కి థాంక్స్. సునీల్ గారు మాకు ఓ పిల్లర్‌గా నిలిచారు. మా కో ప్రొడ్యూసర్స్ ఎంతో సపోర్ట్ చేశారు. జగదీష్ కెమెరా వర్క్ అద్భుతంగా వచ్చింది. చిత్ర సమర్పకుడు చలమలశెట్టి సునీల్ మాట్లాడుతూ.. .సతీష్ జైకి నాకు ఎన్నో ఏళ్ల నుంచి తెలుసు. హీరోగా, దర్శకుడిగా, నిర్మాతగా ఓ సినిమాని

# 'పాంచాలి పంచభర్తృక' మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్



డా. రాజేంద్ర ప్రసాద్ ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా "పాంచాలి పంచభర్తృక. ఈ చిత్రంలో సరి ఫర్, రోల్ రిడా, రాజ్ పవన్, జెమినీ సురేష్, వెంకట్ దుగ్గిరెడ్డి ఇతర కీలక పాత్రల్లో నటించారు. ఫ్యామిలీ డ్రామాతో కూడిన కంప్లీట్ ఎంటర్ టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిం చారు దర్శకుడు గంగ సప్తశిఖర. ఈ చిత్రాన్ని రాయల్ థ్రోన్ ప్రొడక్షన్స్, ఓం సాయిరాం ఆర్ట్స్ బ్యానర్స్ పై వెంకట్ దుగ్గిరెడ్డి (యూఎస్ఏ), రాజ్ పవన్ శ్రీకాంత్ సెట్టివారి, సాయినాథ్ మణ్యం నిర్మించారు. ఈ నెల 14న పాంచాలి పంచభర్తృక సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. మ్యూజిక్ డైరెక్టర్ మహేశ్ నారాయణ మాట్లాడుతూ.. ఈ మూవీకి మ్యూజిక్ చేసేందుకు డైరెక్టర్ గంగ సప్తశిఖర చాలా ఫ్రీడమ్ ఇచ్చారు. తక్కువ టైమ్ లోనే సాంగ్స్ అన్నీ కంపోజ్ చేయగలిగాం. డైరెక్టర్ గంగ సప్తశిఖర మాట్లాడుతూ.. మా సినిమా ఆద్యంతం మిమ్మల్ని ఎంటర్ టైన్ చేస్తుంది. సినిమా మీకు నచ్చకపోతే మా రాయల్ థ్రోన్ బ్యానర్ ఇన్ స్టా పేజికి టికెట్ పెట్టండి మీ డబ్బులు రిటర్న్ ఇస్తాం. నటుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. మా డైరెక్టర్ గంగ సప్తశిఖర కు మంచి కామెడీ టైమింగ్ ఉంది.ఆయన సీన్స్ చెబుతున్నప్పుడే చాలా నవ్వుకున్నాం. ..నటుడు థర్టీ ఇయర్స్ పృథ్వీ మాట్లాడుతూ.. నా కెరీర్ ప్రారంభమైందే రాజేంద్రప్రసాద్ ఆ ఒక్కటీ అడక్కు మూవీతో. ఆ సినిమాలో నా మొదటి సీన్ బైక్ పై వెళ్లే సీన్. ఈ సినిమా వైజాగ్ షెడ్యూల్ టైమ్ లో ఆ సీన్ చేసిన చోట రాజేంద్రప్రసాద్ నేను కలిసి కాసేపు కూర్చుని మాట్లాడుకున్నాం. రాజేంద్రప్రసాద్ సపోర్ట్ చేయకుంటే ఈ థర్టీ ఇయర్స్ కెరీర్ నాకు లేదు. నటి కుమారి ఆంటీ మాట్లాడుతూ.. యూట్యూబ్ లో నన్ను ఫేమస్ చేశారు. సినిమాల్లోకి వస్తానని మాత్రం ఎప్పుడూ అనుకోలేదు. ఈ చిత్రంలో నటించే అవకాశం కల్పించిన మా డైరెక్టర్ గారికి థ్యాంక్స్ నటుడు బాల మాట్లాడుతూ.. దర్శకుడు గంగ సప్తశిఖర నాకు చాలాకాలంగా మిత్రుడు. నేనొక కన్నడ మూవీ ప్లానింగ్ లో ఉన్నప్పుడు ఈ కథ చెప్పారు. ఇందులో డాన్ రోల్ విలన్‌గా నటించాలని చెప్పారు. డాన్ రోల్ ఎలా ఉంటుందా అని ఊహించుకుంటూ ఉన్నాను అన్నారు.

# రూ.37.4 కోట్ల మార్క్‌ను దాటిన 'కొరియన్ కనకరాజు'



ఫస్ట్‌వీకెండ్‌లోనే రూ.37.4 కోట్లకు మార్క్‌ను దాటిన వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు'మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ మరోసారి తన బాక్సాఫీస్ స్టామినాను చూపించారు.హారర్ కామెడీగా తెరకెక్కిన"కొరియన్ కనకరాజు విడుదలైన మూడు రోజుల్లోనే అన్ని ఏరియాల్లో బ్రేక్‌ఈవెన్ మార్క్‌ను దాటుకుని ప్రాఫిట్ జోన్‌లోకి అడుగుపెట్టింది. సినిమాకు సంబంధించిన పాజిటివ్ బజ్ పెయిడ్ ప్రీమియర్స్ నుంచే కనిపించాయి. అది ఇప్పుడు అద్భుతంగా వర్కౌట్ అయింది. ప్రీమియర్స్ చూసిన ప్రేక్షకుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ సినిమాకు బిగ్ ప్రమోషన్‌గా మారింది. సినిమాకు వస్తున్న రెస్పాన్స్‌లో ప్రధానంగా కామెడీకి మంచి ప్రశంసలు దక్కుతున్నాయి. వరుణ్ తేజ్, సత్య కాంబినేషన్ ప్రేక్షకులను బాగా అలరిస్తోంది. వీరిద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు సినిమాకు ప్రధాన బలంగా నిలుస్తున్నాయి. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించిన ఈ చిత్రం.. తొలి వీకెండ్‌లో ప్రపంచవ్యాప్తంగా రూ.37.4 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది. సోమవారం తెలంగాణలో బోనాలు సెలవు కావడంతో సినిమాకు మరో అడ్వాంటేజ్ లభించింది. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్స్ కూడా అద్భుతంగా ఉండటంతో, ఈ హాలిడే సినిమాకు మరింత బలమైన కలెక్షన్స్ తీసుకొచ్చే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం కొరియన్ కనకరాజు రికవరీ దశను దాటి ముందుకు వెళ్లింది. ఇక ఈ సినిమా ఎంత పెద్ద ప్రాఫిట్ అందుకుంటుందనేదే ఆసక్తికరంగా మారింది. ప్రేక్షకుల నుంచి వస్తున్న మౌత్ టాక్, కామెడీకి లభిస్తున్న ఆదరణను చూస్తుంటే.. కొరియన్ కనకరాజుకు లాంగ్ రన్ ఉండబోతుంది.

# 'ప్రేమనే ఊరిలో' హిట్ గ్యారెంటీ!



'ప్రేమనే ఊరిలో'. ఈసారి కూడా హిట్ గ్యారెంటీ! సురేష్ కొండేటి బ్రాండ్ వాల్యూతో 'ప్రేమనే ఊరిలో'అనే సినిమా రాబోతోంది. తెలుగు చిత్రసీమలో నిర్మాతగా, డిస్ట్రిబ్యూటర్‌గా, జర్నలిస్ట్‌గా తనకంటూ ప్రత్యేకమైన ముద్ర వేసుకున్న సురేష్ కొండేటి పేరు వినగానే ప్రేక్షకులకు ముందుగా గుర్తొచ్చేది ఆయన సినిమాల ఎంపి! విలక్షణమైన, కథాబలం ఉన్న చిత్రాలను తెలుగు ప్రేక్షకులకు అందించడంలో ఆయనది సిద్ధహస్తుడైన చెయ్యి. ఆయన నిర్మించిన లేదా సమర్పించిన ప్రేమిస్తే, జర్నీ, పిజ్జా, షాపింగ్ మాల్ వంటి ఎన్నో చిత్రాలు బాక్సాఫీస్ వద్ద సాధించిన ఘనవిజయం, ప్రేక్షకు లకు ఆయనపై ఉన్న నమ్మకాన్ని మరింత పెంచింది.ఏ సినిమాలో అయినా సురేష్ కొండేటి పేరు ఉందంటే.. అందులో ఖచ్చితంగా కంటెంట్ ఉంటుందని, అది ప్రేక్షకులను ఆకట్టుకుని"హిట్ కావడం ఖాయమని టాలీవుడ్‌లో ఒక గట్టి నమ్మకం ఉంది. మనోజ్ కుమార్ దర్శకత్వంలో మహారత్న ప్రొడక్షన్స్, ఎస్.కే పిక్చర్స్, వనిల్లా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై చందు శ్రీనివాస్, సురేష్ కొండేటి, మమత దేవేంద్ర ఎం సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీ రామ్, రామికా శివు, తపస్విని పూణచ్చ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సూపర్ స్టార్ మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా తెలంగాణ ప్రజలు ఎంతో వైభవంగా జరుపుకునే అమ్మవారి బోనాలు పండుగ రోజు ఫిలింనగర్ శ్రీ రాజరాజేశ్వరి దేవస్థానంలో ఫస్ట్ లుక్ ఆవిష్కరణ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. సునాద్ గౌతమ్ సంగీతం, రాజ్‌కాంత్ ఎస్.కే కెమెరా పనితనం, ఈ చిత్రానికి మరిన్ని ప్లస్ పాయింట్లు. సురేష్ కొండేటి సక్సెస్ ఫుల్ ట్రాక్ రికార్డ్‌ను కొనసాగిస్తూ, ఈ 'ప్రేమనే ఊరిలో' కూడా మరొక బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలవడం ఖాయంగా కనిపిస్తోంది!

# 'ఇంద్రపుత్ర' ఫస్ట్ ఛాప్టర్ అనౌన్స్‌మెంట్



'క', 'కె ర్యాంప్', 'చెన్నై లవ్ స్టోరీ' సినిమాలతో హ్యాట్రిక్ బ్లాక్ బస్టర్స్ అందుకున్న హీరో కిరణ్ అబ్బవరం మరో భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టారు. 'క' చిత్రంతో థ్రిల్లర్, 'కె ర్యాంప్' తో మాస్ ఎంటర్ టైనర్, "చెన్నైలవ్ స్టోరీ"తో ఎమోషనల్ లవ్ స్టోరీ చేసిన కిరణ్ అబ్బవరం వైవిధ్యమైన జానర్స్ ను ఎంచుకుంటూ హీరోగా తనను తాను సరికొత్తగా ఆవిష్కరించు కుంటున్నారు. ఈ క్రమంలో జాయ్ ఫిలింస్ లో ఓ సినిమా, 'కెఎ 13' అనే మరో సినిమాతో పాటు సుకుమార్ రైటింగ్స్‌లో 'కెఎ 14' సినిమా చేస్తున్న కిరణ్ అబ్బవరం ఇప్పుడు ' కెఎ15' గా భారీ మైథాలజీ మూవీని ప్రకటించారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా నిర్మాణంలో డెబ్యూ డైరెక్టర్ శ్రీకాంత్ పుప్పాల కాంబినేషన్ లో కిరణ్ అబ్బవరం హీరోగా ఎపిక్ మైథాలజీ మూవీ "ఇంద్రపుత్ర" ఫస్ట్ ఛాప్టర్ ఈ రోజు అనౌన్స్ చేశారు. మైథాలజీ, యాక్షన్, ఫాంటసీ, ఎమోషన్ వంటి అంశాలతో గ్రాండ్ స్కేల్ లో భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ గా "ఇంద్రపుత్ర" ఫస్ట్ ఛాప్టర్ మూవీ నిర్మాణం కానుంది. ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించనుంది. హీరో కిరణ్ అబ్బవరం ఈ చిత్రంలో పవర్ ఫుల్ రోల్ లో సరికొత్త అవతార్ లో కనిపించనున్నారు. 'ఇంద్రపుత్ర' ఫస్ట్ ఛాప్టర్ సినిమా గురించి నిర్మాత ప్రేరణ అరోరా మాట్లాడుతూ 'ఇంద్రపుత్ర" ఫస్ట్ ఛాప్టర్ చిత్రంతో మేమంతా ఎంతో ప్యాషన్ తో ఒక సరికొత్త సినిమాటిక్ వరల్డ్ ను క్రియేట్ చేస్తున్నాం. మన పురాణ ఇతిహాసాల నుంచి స్ఫూర్తిగా తీసుకున్న అంశాలతో నేటి ట్రెండ్ కు తగిన మేకింగ్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం.

# డి.సురేష్‌బాబు ఆవిష్కరించిన 'హుషార్ పిట్టలు' ట్రైలర్!



అన్షు, వాసవి గణేషన్ జంటగా రూపొందుతోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం హుషారు పిట్టలు. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ లు ఏషియన్ సురేష్ ఫిలింస్ సంస్థలు విడుదల చేస్తున్నాయి. ఆగస్టు 15న ఈ చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. ప్రముఖ నిర్మాత డి.సురేష్‌బాబు మాట్లాడుతూ కొన్ని నెలల ముం దు బెక్కెం వేణుగోపాల్ ద్వారా ఈ సినిమా గురించి తెలిసింది. తెలంగాణ నుంచి వచ్చిన దర్శక, నిర్మాతలు ఎంతో పాషన్‌తో సినిమా తీశారు. మా సురేష్ ప్రొడక్షన్స్ ప్రతినిధులు ఈ సినిమా చూసి పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ ఇవ్వడంతో ఈ సినిమాను మా సురేష్ ఏషియన్ ఫిలింస్ ద్వారా విడు దల చేస్తున్నాం. సంగీత దర్శకుడు చరణ్ అర్జున్ మాట్లాడుతూ హుషార్ పిట్టలు చిత్రం ఎంతో నేచురల్‌గా ఉంటుంది ఈ సినిమా చూస్తే అందరికి మీ ఊరికి వెళ్లొచ్చిన ఫీలింగ్ కలుగుతుంది. హీరోయిన్ వాసవి గణేషన్ మాట్లాడుతూ మూవీని ఎంతో నమ్మకంతో చేశాం. షూటింగ్ సమయంలో ఒకరికొకరం ధైర్యం చెప్పుకుంటూ చిత్రీకరణ చేశాం. హీరో అన్షు మాట్లాడుతూ ఈ క్షణాల కోసం 5 ఏళ్లుగా ఎదురుచూస్తు న్నాను. నన్ను నమ్మి దర్శక, నిర్మాతలు నాకు అవకాశం ఇచ్చారు. హీరోగా అవకాశం రావడం నాకు షాకింగ్‌గా అనిపించింది. ఈ సినిమా కంటెంట్ పరంగానే కాకుండా టెక్నికల్‌గా కూడా స్ట్రాంగ్‌గా ఉంటుంది.

11 CTR 5:11 CTR 5.qxd 8/10/2026 11:30 PM Page 1



# వర్సిటీలో వరుస చోరీలు.. భద్రత గాలికి!

## వర్సిటీ ఆస్తులకు రక్షణ కరవు!



తిరుపతి విద్య, ఆగస్టు 10 ప్రభాతవార్త

ఎస్ వి యు లో వరుసగా చోరీలు జరుగుతుండటంతో వర్సిటీ ఆస్తుల భద్రతపై ప్రశ్నలు తలెత్తుతు న్నాయి. తాజాగా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో ఎనిమిది యూనిట్లకు సంబంధించిన కాపర్ వైర్‌తో పాటు 8 కంప్రెసర్లు మాయమైనట్లు పరిశోధక విద్యార్థి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్ తెలిపారు. పెద్ద మొత్తంలో సామగ్రి మాయమైన ఘటనపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, వర్సిటీలో పనిచేస్తున్న కొందరి ప్రమేయం లేకుండా ఇంత భారీగా సామగ్రి మాయం కావడం సాధ్యం కాదనే అనుమానాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనను బయటకు రాకుండా వర్సిటీ ఉన్నతాధికారులు తొక్కిపెట్టే ప్రయత్నం చేస్తున్నారని అశోక్ కుమార్ ఆరోపించారు. ఇప్పటికే రెండు నెలల క్రితం కామర్స్ విభాగంలో కంప్రెసర్లు చోరీకి గురయ్యాయని, తాజాగా సి ఎస్ ఈ విభాగంలో కాపర్ వైర్, కంప్రెసర్లు మాయం కావడం వర్సిటీ భద్రతా వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. క్యాంపస్‌లోకి బయట వ్యక్తుల రాకపోకలు పెరుగుతున్నప్పటికీ సెక్యూరిటీ వ్యవస్థ తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. విలువైన వర్సిటీ ఆస్తులు వరుసగా మాయమవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం ఆందోళనకరమన్నారు. ఇటీవల రాత్రి 7 గంటల సమయంలో పరిపాలనా భవనం ఎదుట బీఈడీ విద్యార్థులపై బయట వ్యక్తులు దాడి చేసిన ఘటనతో పాటు, అంతకుముందు మద్యం మత్తులో ఉన్న వ్యక్తులు సెక్యూరిటీ సిబ్బందిపై దాడి చేసి హంగామా చేసిన ఘటనలను ఆయన గుర్తుచేశారు. వరుసగా చోటుచేసుకుంటున్న ఈ ఘటనలు వర్సిటీలో భద్రతా వ్యవస్థ బలహీనంగా ఉందనడానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇకనైనా వర్సిటీ ఉన్నతాధికారులు స్పందించి క్యాంపస్‌లోకి అనధికారికంగా ప్రవేశించే వ్యక్తుల రాకపోకలను అరికట్టాలని, వర్సిటీ ఆస్తులకు పటిష్టమైన భద్రత కల్పించాలని అశోక్ కుమార్ డిమాండ్ చేశారు సి ఎస్ ఈ విభాగంలో మాయమైన కాపర్ వైర్, కంప్రెసర్లతో పాటు గతంలో జరిగిన చోరీలపై సమగ్ర విచారణ జరిపించాలని, నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన సెక్యూరిటీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

# మహతి వేదికపై మెరిసిన రెండు నాటికలు

## సమ్మక్క స్ఫూర్తి.. కృష్ణ పక్షం విషాదం

తిరుపతి విద్య ఆగస్టు 10 ప్రభాత వార్త





తిరుపతిలోని స్థానిక మహతి ఆడిటోరియంలో సోమవారం రెండు నాటికలను ప్రదర్శించారు. గిరిజనుల పోరాట స్ఫూర్తిని ప్రతిబింబించే సమ్మక్క–సారలమ్మల గాథతో పాటు, అసూయకు బలైన అమర ప్రేమను ఆవిష్కరించే కృష్ణ పక్షం నాటికలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. భిన్నమైన కథాంశాలతో సాగిన ఈ నాటికలు వినోదంతో పాటు సామాజిక సందేశాన్ని అందించాయి. సమ్మక్క గాథలో పొలవాస సామంతరాజు మేదరాజుకు అడవిలో పులుల మధ్య ఓ చిన్నారి కనిపించడంతో ఆమెను దైవ ప్రసాదంగా భావించి పెంచుకున్నట్లు కథనం. ఆ చిన్నారే సమ్మక్కగా ఎదిగి గిరిజన ప్రజలకు అండగా నిలుస్తుంది. పగిడిద్దరాజుతో వివాహం అనంతరం వారికి సారలమ్మ, నాగులమ్మ, జంపన్న జన్మిస్తారు. కాకతీయ సామ్రాజ్యంలో కరువు ఏర్పడిన సమయంలో కప్పం చెల్లించే విషయంలో ఏర్పడిన వివాదం యుద్ధానికి దారితీస్తుంది. ఆ యుద్ధంలో కుటుంబ సభ్యులను కోల్పోయిన సమ్మక్క గిరిజనుల కోసం పోరాడి అదృశ్యమైందని గాథ చెబుతోంది. ఆమె జ్ఞాపకార్థం మేడారం జాతర కొనసాగుతోందని విశ్వాసం. ఇక కృష్ణ పక్షం నాటికలో విజయనగరానికి చెందిన కవి విశ్వనాథ ప్రతిభను చూసి విరూపాక్ష కవి అసూయకు గురవుతాడు. అతని కవిత్వాన్ని దెబ్బతీయాలనే ఉద్దేశంతో తులసిని విశ్వనాథ వద్దకు పంపిస్తాడు. అయితే తులసి అతని ప్రేమకు ఆకర్షితురాలై చివరకు అతడినే ప్రాణసమానంగా భావిస్తుంది. విరూపాక్ష కవి తులసిని బలవంతంగా తీసుకెళ్లడంతో విశ్వనాథ తీవ్ర వేదనకు గురవుతాడు. చివరకు తులసి విషం తీసుకుని, వజ్రపు ఉంగరంలోని వజ్రాన్ని మింగి ప్రాణాలు కోల్పోగా, ఆమెను కోల్పోయిన విశ్వనాథ కూడా మరణిస్తాడు. ఒకవైపు సమ్మక్క గాథ త్యాగం, ధైర్యం, ఆత్మగౌరవం, ప్రజల కోసం పోరాటాన్ని ప్రతిబింబిస్తే, కృష్ణ పక్షం అసూయ, అహంకారం, ఓర్వలేనితనం ఎంతటి అనర్థాలకు దారితీస్తాయో హెచ్చరిస్తుంది. రెండు నాటికలు భిన్నమైన కథాంశాలతో ప్రేక్షకులకు వినోదంతో పాటు సామాజిక సందేశాన్ని అందించాయి.

# ఇంటి స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని వినతి

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 10 ప్రభాత వార్త:



చిట్టమూరు మండలం గుణపాడు గ్రామంలోని గిరిజన కాలనీలో నివాసం ఉంటున్న గిరిజన కుటుంబాలు ఇళ్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా కాలనీలో నివాసం ఉంటున్నప్పటికీ తమకు సొంత ఇళ్లు లేకపోవడంతో వర్షాలు, ఎండలు, ఇతర కాలాల్లో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని తెలిపారు. తమ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండటంతో సొంతంగా ఇళ్లు నిర్మించుకునే స్థోమత లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం తమ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని గిరిజన కుటుంబాలకు ఇంటి స్థలాలు మంజూరు చేయడంతో పాటు ప్రభుత్వ పథకం ద్వారా పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఆఫీస్ లో సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో జాయింట్ కలెక్టర్ ను కలిసి తమ సమస్యలను వివరించి వినతి పత్రం సమర్పించారు.

# పేదలకు అన్నదానం

తిరుపతి, ఆగస్టు 10ప్రభాతవార్త:



బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పి వి ఎన్ మాధవ్ పేరున బిజెపి నాయకులు పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు గుండాల గోపి నాథ్ రెడ్డి, కట్టమంచి చంద్ర బాబు యాదవ్, సుబ్రహ్మణ్యం యాదవ్ ఏ వన్ మస్తాన్, లోక ప్రభాకర్ నాయుడు, విగ్రహాల కళ్యాణి, కవిత, సిద్ధమ్మ, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, జయంత్ కుమార్, మిట్టపల్లి బ్రహ్మానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్వీబీసీ ఛైర్మన్ శ్రీధర్ వర్మకు ఘన సత్కారం

రేణిగుంట ఆగస్టు 10 ప్రభాతవార్త



తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్ కు నూతన ఛైర్మన్గా నియమితులైన శ్రీధర్ వర్మను తెలుగుదేశం పార్టీ రేణిగుంట పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా ఆధ్వర్యంలో రేణిగుంట మండల పట్టణ టిడిపి నేతలు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. శ్రీవారి భక్తి ఆధ్యాత్మిక కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని మహబూబాషా కోరారు. సత్కరించిన వారిలో జి పాలెం టిడిపి సీనియర్ నేత రాజశేఖర్ రెడ్డి, యూనిట్ ఇంచార్జ్ కిరణ్, బాబు, చిన్న బాబు, వేణు, సంపత్ తదితరులు ఉన్నారు.

# స్విమ్స్ ఆధ్వర్యంలో మధురానగర్ 17, 18లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం

తిరుపతి హెల్త్, ఆగస్టు 10, ప్రభాతవార్త




శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో సోమవారం తిరుపతి ఎర్రమిట్ట అర్బన్ పిహెచ్సీలో మధురానగర్ 17, 18 సచివాలయాల పరిధిలోని ప్రజలకు పింక్ బస్ ద్వారా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, ముందస్తు నివారణ చర్యలపై డాక్టర్లు చిత్రపటాల ద్వారా అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమాలు, మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతున్నాయి. పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించారు. స్విమ్స్ డైరెక్టర్ కమ్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ అంజు డి ఆదె మార్గదర్శకత్వంలో నోడల్ ఆఫీసర్లు డాక్టర్ భవాని, డాక్టర్ శివసంతోష్ పర్యవేక్షణలో ఈ వైద్య శిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎర్రమిట్ట అర్బన్ పిహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యశ్వంత్, పింక్ బస్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పద్మావతి, డాక్టర్ హరిత, డాక్టర్ లావణ్య, డాక్టర్ మేఘన, ఏఎన్ఎంలు అరుణ, ధనమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీపై సీబీఐ విచారణకు డిమాండ్

## నారా లోకేశ్ రాజీనామా చేయాలి: మాజీ ఎమ్మెల్యే కొరముట్ల.

రైల్వే కోడూరు అర్బన్, ఆగస్టు 10 ప్రభాతవార్త.




మెగా డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ సీబీఐతో విచారణ జరిపించాలని, సంబంధిత విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో సోమవారం రైల్వేకోడూరులో భారీ శాంతియుత ర్యాలీ నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కోడూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. కోడూరు పట్టణంలోని రాజ్ కన్వెన్షన్ నుంచి ర్యాలీ ప్రారంభమైంది. "విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిన నారా లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలి. డౌన్ డౌన్ సీఎం అంటూ నినాదాలు చేస్తూ పార్టీ నాయకులు, యువత, విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ ఎన్టీఆర్ సర్కిల్, టోల్‌గేట్, వైఎస్సార్ విగ్రహం మీదుగా కొనసాగింది. అనంతరం గాంధీజీ విగ్రహం వద్ద వినతిపత్రం సమర్పించారు. అక్కడి నుంచి వైఎస్సార్సీపీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ నాయకులు మాట్లాడుతూ మెగా డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువత, విద్యార్థులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. డీఎస్సీ వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చిట్వేల్ మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులురెడ్డి, ఓబులవారిపల్లి మండల కన్వీనర్ సాయికిషోర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్‌లు, డైరెక్టర్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, జిల్లా కార్యదర్శులు, యువత, విద్యార్థులు, ఐదు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కేజీబీవీలలో విజయ పథం అమలు చేసి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

పెనగలూరు ఆగస్టు 10 ప్రభాతవార్త



పెనగలూరు , చిట్వేలు పుల్లంపేట ఓబులవారిపల్లి కేజీబీవీ పాఠశాలను సోమవారం ఆకస్మిక తనిఖీ చేసిన రాష్ట్ర కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలల సెక్రటరీ దేవానంద రెడ్డి బాలికలలో 100 ఉత్తీర్ణత సాధించ డానికి విజయ పథం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించడమే కాక, ప్రతిరోజు బోధించిన పాఠ్యాంశంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులను ఉన్నతి (92100 మార్కులు) ప్రగతి (6589 మార్కులు) దీప్తి (4064 మార్కులు) స్ఫూర్తి (039 మార్కులు) గ్రేడులుగా విభజించి ,విద్యార్థుల సామర్థ్యాలను అనుసరించి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పాఠశాలకు మౌలిక వసతులలో భాగంగా పెనగలూరులో ఇంటర్మీడియట్ బాలికల కొరకు నూతనంగా నిర్మించిన భవనాన్ని అందుబాటులోకి తేవడమే కాక అన్ని కేజీబీవీలకు త్వరలో బెడ్ లను అందజేయనున్నట్లు తెలియజేశారు. పాఠశాలలో సౌకర్యాలను గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ జి సి డి ఓ లు సబిహా సుల్తాన్, విజయలక్ష్మి ్మ, పెనగలూరు ఎంఈఓ ఎం. గిరి వరదయ్య, కేజీబీవీ ప్రిన్సిపాల్ సుచరిత, సంబంధిత మండలాల ఎంఈఓ లు , పాఠశాలల ప్రిన్సిపాల్స్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్ని ఫేక్ ప్రచారాలు చేసినా వైయస్సార్సీపి అధికారంలోకి రాదు

## పంతగాని నరసింహ ప్రసాద్.

రైల్వే కోడూరు అర్బన్ ఆగస్టు 10 ప్రభాత వార్త.



రైల్వే కోడూరు లో వైఎస్ఆర్సిపి చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు, ర్యాలీలపై టిడిపి రాష్ట్ర సాంస్కృతిక శాఖ విభాగ అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ అవినీతి సొమ్ముతో అందలమెక్కాలనుకుని, ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన పార్టీ, అత్యంత అవినీతి పరిపాలన చేసి అగాధంలోకి ప్రజల చేత తొక్కబడిన పార్టీ, వైఎస్సార్ సీపీ పార్టీ, గత చరిత్ర చూస్తే అక్రమాలు, దౌర్జన్యాలు చేస్తూ ఈరోజు శుద్ధ పూసలాగా మాటలు మాట్లాడుతున్నారన్నారు. డీఎస్సీ మీద ఫేక్ ప్రచారాలు చేస్తున్నారన్నారు. జగన్మోహన్ రెడ్డికి ఒకటే చెప్పాలనుకుంటున్నానని కుండ బద్దలు కొట్టి చెప్తున్న మీరుగా అధికారంలోకి రారు. ఇది జగన్మోహన్ రెడ్డి కలే అన్నారు. రెండు రోజులు నిరాహార దీక్ష ఈరోజు ర్యాలీ అంటూ ఫేక్ ప్రచారాలు చేస్తూ ప్రజలను కల్లబొల్లి మాటలతో మభ్యపెడుతున్నారన్నారు. ఈరోజు జరిగిన ర్యాలీలో ఒక్కరినైనా డీఎస్సీ బాధితుని చూపించాలని 24 గంటలు జరగకముందే డీఎస్సీ బాధితులు ఎవరున్నా మా ముందుకు తీసుకురావాలని మేము న్యాయం చేస్తామని తెలిపారు. నారా లోకేష్ ఎందుకు రాజీనామా చేయాలని విద్యావ్యవస్థను ఎన్నడూ లేని విధంగా ముందుకు తీసుకు వెళుతున్నందుకా లేక పేదలకు నాణ్యమైన భోజనం అందిస్తున్నందుకు లేక 16 వేల మందికి డీఎస్సీ ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చినందుకా లేక నిరుద్యోగాన్ని నిర్మూలిస్తున్నందుకా ఎందుకు చేయాలని తీవ్రంగా మండిపడ్డారు. మళ్లీ జాబ్ క్యాలెండర్ వదులుతారని మళ్లీ మళ్లీ డీఎస్సీ జరుపుతామని మీ ఫేట్ ప్రచారాలకు ప్రజలు ఎవరు నమ్మరని ప్రజలు తమ అమూల్యమైన ఓటుతోనే బుద్ధి చెబుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖాది గ్రామీణ అభివృద్ధి శాఖ చైర్మన్ కేకే చౌదరి, పోతురాజు నవీన్ హేమరాజ్, స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి

వడమాలపేట, ఆగస్టు 10 ప్రభాతవార్త:



రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని గుంటూరు సంయుక్త వ్యవసాయ సంచాలకులు, ప్రత్యేక అధికారి ఎం. విజయభారతి తెలిపారు. సోమవారం వడమాలపేట మండలంలో రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. పీఎండీఎస్ సాగు, సీడ్ పెల్లటైజేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా వేరుశనగ పంటలు, ప్రతి సర్వే నెంబరులో పంట ఆరోగ్య పరిస్థితి, అలాగే ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు బీడు భూముల్లో పీఎండీఎస్ విత్తనాల సాగును ప్రోత్సహించాలని, అలాగే వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న సీడ్ పెల్లటైజేషన్ విధానాన్ని వినియోగించుకోవాలని ప్రత్యేక అధికారి సూచించారు. రైతులు ఫార్మర్ యాప్‌ను తమ మొబైల్ ఫోన్లలో తప్పని సరిగా ఇన్‌స్టాల్ చేసుకుని వ్యవసాయానికి సంబంధించిన సాంకేతిక సలహాలు, ఎరువులు, పురుగుమందులు, తదితర వివరాలను ఏఐ ఆధారిత సేవలు పొందాలని ఆమె సూచించారు. తిరుపతి జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.ప్రసాదరావు, ఏడీఏ ధనంజయరెడ్డి, వ్యవసాయ అధికారులు విజయకుమార్, హరిత, పుత్తూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కె.లక్ష్మీదేవి, సాంకేతిక వ్యవసాయ అధికారి జి.యామిని, గ్రామ అభ్యుదయ రైతులు భాస్కర్‌నాయుడు, ఎత్తిరాజులు, వ్యవసాయ సహాయకులు మోహన్, సాగర్‌రెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

# రాష్ట్రస్థాయి యోగా పోటీలకు క్రీడాకారుల ఎంపిక

## తిరుపతిలో జిల్లా స్థాయి పోటీలు




తిరుపతి విద్య, ఆగస్టు 10 ప్రభాతవార్త

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు క్రీడాకారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా తిరుపతిలో సోమవారం జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. చెన్నారెడ్డి కాలనీలోని లిటిల్ స్టార్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ చిత్తూరు జిల్లా ఆధ్వర్యంలో పోటీలు, జిల్లా జట్టు ఎంపిక కార్యక్రమం జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 29, 30 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించనున్న 51వ రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక చేయనున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రాజేష్ రాయల్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే యోగాను సాధన చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చన్నారు. యోగా ద్వారా ఒత్తిడిని అధిగమించడంతో పాటు ఏకాగ్రత, రోగనిరోధక శక్తి పెంపొందుతాయని తెలిపారు. పర్యవేక్షణ అధికారి మనోహర్‌రెడ్డి క్రీడాకారులకు యోగా ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భీమా మురళి, కార్యదర్శి కె. వెంకటరమణ, కోశాధికారి మాధవి తదితరులు పాల్గొన్నారు.

# యస్వీయూలో బీటెక్ (స్వీడన్) ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి విద్య, ఆగస్టు 10 ప్రభాత వార్త




ఎస్ వి యు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ (స్వీడన్) ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు తెలిపారు. 2026–27 విద్యా సంవత్సరానికి ఈ ప్రోగ్రామ్‌లో చేరాలనుకునే విద్యార్థులు ఆగస్టు 11 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, స్వీడన్‌లోని బ్లెకింగె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మధ్య కుదిరిన పరస్పర అంగీకార ఒప్పందం ప్రకారం ఈ నాలుగేళ్ల బీటెక్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ తెలిపారు. ఇందులో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. నాలుగేళ్ల ప్రోగ్రామ్‌లో తొలి మూడేళ్లు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో, చివరి ఏడాది స్వీడన్‌లోని బ్లెకింగె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో విద్యాభ్యాసం చేయాల్సి ఉంటుందని వివరించారు. అంతర్జాతీయ స్థాయి విద్యను అభ్యసించే అవకాశం ఈ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థులకు లభిస్తుందని తెలిపారు. ప్రవేశాల కోసం యస్వీయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం యస్వీయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని రిజిస్ట్రార్ భూపతి నాయుడు కోరారు.

# క్వాంటమ్ సాంకేతిక పరిశోధనలకు ఊతం

## శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాల-బీఎల్ఓక్యూ మధ్య అవగాహన ఒప్పందం



తిరుపతి విద్య, ఆగస్టు 10 ప్రభాత వార్త

ఆధునిక సాంకేతిక రంగాల్లో పరిశోధనలను ప్రోత్సహించేందుకు తిరుపతిలోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాల, కేరళలోని కొల్లంకు చెందిన బీఎల్ఓక్యూ క్వాంటమ్ టెక్నాలజీ సంస్థల మధ్య సోమవారం అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంతో అధ్యాపకులు, విద్యార్థులకు పరిశోధన, సాంకేతిక శిక్షణలో మరిన్ని అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. ఒప్పందంలో భాగంగా సంయుక్త పరిశోధనా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ఆధునిక సాంకేతిక అంశాలపై పరిశోధనా ప్రాజెక్టులను చేపట్టేందుకు ఇరు సంస్థలు సహకరించనున్నాయి. పరిశోధనా ఫలితాలను జాతీయ, అంతర్జాతీయ స్థాయి పరిశోధనా పత్రికల్లో ప్రచురించేందుకు, వినూత్న ఆలోచనలను పేటెంట్లుగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన సహకారం అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బీఎల్ఓక్యూ క్వాంటమ్ టెక్నాలజీ సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్రీకుట్టన్ మాట్లాడుతూ పరిశ్రమ, విద్యాసంస్థల మధ్య ఇలాంటి భాగస్వామ్యాలు పరిశోధనలకు ఆచరణాత్మక దిశను చూపుతాయన్నారు. అధ్యాపకులకు విస్తృత పరిశోధనా అవకాశాలు లభించడంతో పాటు విద్యార్థులకు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. పరిశోధనా ప్రచురణలు, పేటెంట్ అభివృద్ధి, సాంకేతిక శిక్షణ వంటి అంశాల్లో పరస్పరం సహకరించుకోవడం ద్వారా పరిశోధన ఆధారిత విద్యకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని కళాశాల ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, కార్యదర్శి మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డా. కె. జయచంద్ర, కార్యక్రమ సమన్వయకర్తలు డా. ఏ. మునిశంకర్, డా. ఆర్. నాగేంద్ర, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# శాస్త్రీయ పద్ధతులను పాటిస్తే నష్టాలను తగ్గించుకోవచ్చు

## - శాస్త్రవేత్త మురళీకృష్ణ




సత్యవేడు, ఆగస్టు 10 ప్రభాతవార్త:

రైతులు శాస్త్రీయ పద్ధతులను పాటించడం ద్వారా వాతావరణం ప్రతికూల పరిస్థితుల్లో పంట నష్టాలను తగ్గించుకోవచ్చని ప్రిన్సిపల్(ఎంటమాలజీ)మురళీకృష్ణ సూచించారు. సోమవారం సత్యవేడు మండలం మదనంబేడు గ్రామంలో మండల వ్యవసాయ శాఖ ఏడీఏ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల బృందం పర్యటించి ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవడంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మురళీకృష్ణ మాట్లాడుతూ ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలన్నారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కోరారు. ప్రస్తుత ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం అస్థిరంగా ఉండడం, దీర్ఘకాలిక పొడి విరామాలు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు పంటల్లో తేమను సంరక్షించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా వరి, సజ్జ పంటల్లో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తూ కీలక దశల్లో తేమ ఒత్తిడి రాకుండా చూడాలని సూచించారు. రసాయన ఎరువులు అధికంగా వాడడం వల్ల నేల సహజ సారం కోల్పోతుందన్నారు. పైగా వ్యవసాయంలో వాడే పురుగు మందులు కూడా భూగర్భ జలాల్లోకి చేరి నీటిని కలుషితం చేస్తున్నాయన్నారు. నీటి వనరులు అతిగా వాడడం వల్ల రసాయనాల వల్ల గ్రీన్‌హౌస్ ఉద్గారాలు పెరిగిపోయి వాతావరణం దెబ్బతింటున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎస్వీ వ్యవసాయ కళాశాల నిర్మల్‌కుమార్, లక్ష్మి, టి.మహేష్‌బాబు, కె.శ్రీనివాసులు, అనిల్, వ్యవసాయ ఏవో మురళి, పలువురు రైతులు పాల్గొన్నారు.

